

నింద్ర ఎంపీపీ రాజీనామా



రాజీనామా పత్రాన్ని జడ్పీ సీఈవోకు అందజేస్తున్న దీప

నింద్ర, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నింద్ర మండల పరిషత్ అధ్యక్షురాలు దీప తన పదవికి రాజీనామా చేశారు. సోమవారం మధ్యాహ్నం రాజీనామా పత్రాన్ని జడ్పీసీఈవో రవికుమార్ నాయుడికి అందజేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఎన్నికల్లో మండలంలోని 8 ఎంపీటీసీ స్థానాల్లో ఏడింటిని వైసీపీ కైవసం చేసుకుంది.కావనూరులో టీడీపీ గెలిచింది.వైసీపీ సీనియర్ నేత చక్రపాణిరెడ్డి సోదరుడు కొప్పేడు ఎంపీటీసీ భాస్కర రెడ్డి ఎంపీపీగా ఎన్నిక అవుతారని జోరుగా ప్రచారం సాగింది. ఈ సందర్భంగా కావనూరు ఎంపీటీసీ కూడా టీడీపీ నుంచి వైసీపీలో చేరిపోయారు. ఎంపీపీ కావడానికి కావలసినంత మెజారిటీ భాస్కర రెడ్డికి ఉండగా ఎమ్మెల్యే రోజా తెరపైకి ఎలకాటూరు ఎంపీటీసీ దీప పేరును తీసుకొచ్చారు.భాస్కర్‌రెడ్డి ఎంపీపీ కావాలని చక్రపాణిరెడ్డి వర్గీయులు ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించినా చివరకు దీప ఎంపీపీగా ఎన్నికైంది. అప్పటి నుంచి చక్రపాణిరెడ్డి వర్గీయులు వైసీపీకి దూరంగా ఉంటూ ఎన్నికల ముందు టీడీపీలో చేరిపోయారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎంపీపీని పదవి నుంచి దించే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి.ఈ నేపథ్యంలో శనివారం వారంతా తమ వర్గానికి మద్దతిచ్చే ఎంపీటీసీల సంతకాలతో కూడిన అవిశ్వాస తీర్మాన పత్రాన్ని నగరి ఆర్డీవోతో పాటు కలెక్టర్‌కు అందజేసినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ దీప రాజీ ప్రయత్నాలు చేసినా విఫలమయ్యాయి.ఈ నేపథ్యంలో సోమవారం నేరుగా జడ్పీ సీఈవో రవినాయుడిని కలసిన దీప తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు.మిగిలిన ఏడాది కాలంలో నింద్ర ఎంపీపీ పదవి ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సి ఉంది.

బ్రహ్మోత్సవాలలో నేడు

ఉదయం: 8-10 మధ్య సూర్యప్రభ వాహనం

మధ్యాహ్నం: 1-3 మధ్య స్నపన తిరుమంజనం

రాత్రి: 7-9మధ్య చంద్రప్రభ వాహనం









ముచ్చటగా మూడు వాహనాలు



తిరుమల బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం మలయప్పస్వామి మూడువాహనాలపై నాలుగు మాడవీధుల్లో ఊరేగారు. ఉదయం 9 గంటలకు కోదండరాముడిగా హనుమంతవాహనంపై.. సాయంత్రం 4 గంటలకు స్వర్ణరథంపై.. పట్టాభిషేకానికి వెళ్లే రారాజులా రాత్రి 7 గంటలకు గజవాహనంపై భక్తకోటిని అనుగ్రహించారు. పెరటాశి రెండో శనివారం, ఆదివారం గరుడసేవ సందర్భంగా తిరుమల కిటకిటలాడింది. ఆదివారం అర్ధరాత్రికే చాలా మంది తిరుగు ప్రయాణం కావడంతో రద్దీ సాధారణ స్థితికి చేరుకుంది. మరోవైపు తిరుమలలో చలి తీవ్రత పెరిగింది. అయినా, భక్తులు గ్యాలరీల్లోనే కూర్చుని వాహన సేవలను వీక్షించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



అక్రమాల రెస్కో!

- నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు.. పదోన్నతులు.. తప్పుడు ఆడిటింగ్... మితిమీరిన వేతనాలు
- నిజాలు నిగ్గు తేల్చిన విచారణ నివేదిక
- మహాజన సభలో సమర్పణ



జ్యోతి వెలిగించి మహాజన సభను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, రెస్కో చైర్మన్ ప్రతాప్, పీఎస్ఎం తదితరులు

కుప్పం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కుప్పం రెస్కోలో నియామకాలు, పదోన్నతులు, ఆడిటింగ్ నివేదికలు, వేతనాల పెంపు... అన్నింటా సహకార చట్టం నిబంధనల అతిక్రమణ యథేచ్ఛగా సాగింది.సహకార సంఘాల అదనపు రిజిస్ట్రార్ కె.శ్రీలక్ష్మి ప్రభుత్వానికి సమర్పించిన విచారణ నివేదికలో రెస్కోలో జరిగిన అవినీతి, అక్రమాలను విస్పష్టంగా తేల్చింది.ప్రధానంగా పేర్కొనక పోయినా గత వైసీపీ ప్రభుత్వ పాలనాకాలంలోనే నిబంధనల అతిక్రమణ ఎక్కువ జరిగినట్టు నివేదిక నిర్ధారించింది. పుష్కరకాలం తర్వాత సోమవారం జరిగిన రెస్కో మహాజన సభ (సర్వసభ్య సమావేశం)లో విచారణ వేదికను బయటపెట్టారు. రెస్కో చైర్మన్ వీజీ.ప్రతాప్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డైరెక్టర్లు, రెస్కో ఎండీ సోమశేఖర్, ఉద్యోగులు, షేర్ హోల్డర్లు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్,ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్. మునిరత్నం, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, ఏఎంసీ చైర్మన్ జీఎం.రాజు తదితరులు ప్రత్యేక ఆహ్వానితులుగా హజరయ్యారు. విచారణ నివేదికలో ప్రధానంగా రెస్కోలో జరిగినట్లుగా గుర్తించి నిర్ధారించిన అవినీతి చర్యలు, విచారణాధికారి చేసిన చర్యల సిఫార్సులు ఇవీ...● రెస్కోలో మంజూరు పోస్టులు 167 కాగా, ప్రస్తుతం 229 మంది పని చేస్తున్నారు. వీరుగాక అదనంగా 124 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. 124 మందికి నిబంధనలను అతిక్రమించి అక్రమంగా ఉద్యోగాలు ఇచ్చారు. ఇందులో అవసరం లేకపోయినా ఇచ్చిన ఉద్యోగాలు, మంజూరు కాకపోయినా కల్పించిన పోస్టుల్లో చేసిన నియామకాలు ఉన్నాయి. వీరిపై చర్యలు తీసుకోవాలి● 2021లో పర్చస్ ఇన్‌చార్జి కమిటీ సభ్యురాలిగా రాజీనామా చేసిన వసుంధరతో పాటు మిగిలిన సభ్యుల సంతకాలను ఫోర్జరీ చేసి, పరిపాలనాపరమైన నిర్ణయాలు తీసుకున్నారు. దీనిపై అప్పటి రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్, ఎండీ సుబ్రహ్మణ్యంపై చర్యలు తీసుకోవాలి.● సంస్థలోని 48 మందికి అప్పటి ఎండీ సుబ్రహ్మణ్యం పాత తేదీలతో పదోన్నతులు కల్పించి, జీతాలు చెల్లించేలా నిర్ణయం తీసుకున్నారు. ఆయనపై చర్యలు తీసుకోవడంతో పాటు అదనంగా చెల్లించిన నగదు మొత్తం రూ.89,563 ఉద్యోగులనుంచి రికవరీ చేయాలి.

● సెలవులను, సస్పెన్షన్ కాలాన్ని రెగ్యులైజ్ చేసి ఎం.కృష్ణమూర్తి అనే ఉద్యోగికి కల్పించిన రెండు పదోన్నతులు రద్దు చేసి రివర్షన్ ఇవ్వాలి.● నిబంధనలకు విరుద్ధంగా అప్పటి చైర్మన్ సెంథిల్ కుమార్‌కు చెల్లించిన వెహికల్ చార్జీలు రూ.22,52,689 నగదు మొత్తాన్ని ఆయననుంచి రికవరీ చేయాలి.నిబంధనలకు విరుద్ధంగా గత పీఐసీ కమిటీ సభ్యులకు చెల్లించిన రూ.2,17,600 నగదు మొత్తాన్ని వారినుంచి రికవరీ చేయాలి.● 2021-2022 మధ్యలో జరిగిన ఆడిటింగ్‌లో అవకతవకలకు పాల్పడిన ఆడిటర్ వై.రమేష్‌పై చర్యలు తీసుకోవాలి.● ఫేక్ ఐటీఐ సర్టిఫికెట్‌తో పదోన్నతి పొందిన ఆర్.నారాయణప్పపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి.

● రెస్కోలో అవినీతికి, అక్రమాలకు బాధ్యులైన సహకార సంఘం అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి.

● సహకార సంఘాల చట్టానికి విరుద్ధంగా పే ఫిక్సేషన్ చేసుకుని అధిక వేతనాలు పొందుతున్న వారిపైనా, ఇందుకు కారణమైన అప్పటి ఎండీ సుబ్రహ్మణ్యంపైనా సంస్థాపరమైన చర్యలు తీసుకోవాలి.● అన్ని అవినీతి, అక్రమాలకు వీలు కల్పించేలా బైలాస్‌ను సవరించడానికి కారణమైన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి.● ప్రాజెక్ట్ ఇంజనీరుగా కొనసాగుతున్న ఏఎస్.హిమ్మత్ సాగర్‌ను అదనపు సిబ్బందిగా గుర్తించకపోతే మంజూరైన సిబ్బంది సంఖ్యకు అనుగుణంగా సర్దుబాటు చేయాలి. లేదంటే నోటీసు ఇచ్చి అతడి సేవలను రద్దు చేయాలి.● అక్రమంగా జరిగిన పదోన్నతులపై కోర్టులను ఆశ్రయించి, న్యాయం జరిగేలా చూడాలి.ఇంకా పలు ఆరోపణలపై అందిన ఫిర్యాదులపైన సమగ్ర విచారణ జరిపిన విచారణాధికారి, ఆయా అక్రమాలు, అవినీతి చర్యలను నిర్ధారించింది.బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.



రాజరాజేశ్వరి అలంకారంలో చిత్తూరులోని గిరింపేట దుర్గమ్మ

సరస్వతీదేవిగా బోయకొండ గంగమ్మ



చౌడేపల్లె, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): బోయకొండ దసరా ఉత్సవాల్లో సోమవారం సరస్వతీదేవిగా గంగమ్మ భక్తులకు దర్శనమిచ్చారు.రెండు చేతుల్లో వీణ, ఒక చేతిలో వేదాలు, మరో చేతిలో రుద్రాక్షమాలతో గంగమ్మను అలంకరించి, ధూప దీప, నైవేద్యం సమర్పించారు.

డీసీసీబీ భోక్తలపై తదుపరి చర్యలకు బ్రేక్

ఎనిమిది వారాల పాటు మధ్యంతర స్టే మంజూరు చేసిన హైకోర్టు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) జరిగిన అవినీతి, ఆర్థిక అక్రమాల్లో భోక్తలుగా గుర్తించిన వారిపై తీసుకోనున్న తదుపరి చర్యలపై ఎనిమిది వారాల పాటు మధ్యంతర స్టే ఇస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది.డీసీసీబీ పాలకవర్గం ఇష్టారాజ్యంగా వ్యవహరించిందంటూ మాజీ ఎమ్మెల్సీ దొరబాబు చేసిన ఆరోపణలపై ప్రభుత్వ ఆదేశాల మేరకు జరిగిన విచారణ లో 120 మందిని బాధ్యులుగా గుర్తించి రూ.21.12 కోట్లు దుర్వినియోగం జరిగిందని తేల్చారు. అప్పటి బోర్డు డైరెక్టర్ ఎన్. బాలసుబ్రహ్మణ్యం ఈ వ్యవహారంపై గత వారం హైకోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేశారు.కలెక్టర్, సహకార శాఖ కమిషనర్, డీఆర్వో, డీసీవో, డీసీసీబీ సీఈవోలను ప్రతివాదులుగా చేర్చారు.బ్యాంకు వ్యవహారాలపై పక్షపాత, నకిలీ విచారణ నిర్వహించడంతో పాటు ఏకపక్షంగా ఇచ్చిన సెక్షన్-51 విచారణ నివేదికను రద్దుచేయాలని కోరారు. ప్రభుత్వం తరపు న్యాయవాది మాట్లాడుతూ అధికారులకు అందిన సమాచారం ఆధారంగా విచారణ నిర్వహించామని, పిటీషనర్‌పై ఎటువంటి చర్యను ప్రతిపాదించలేదని తెలిపారు. దీనిపై హైకోర్టు సైతం కేసు వాస్తవాల పరిస్థితుల దృష్ట్యా 51 సెక్షన్ విచారణ నివేదిక్నపై తీసుకొనే తదుపరి చర్యలపై 8 వారాలపాటు మధ్యంతర స్టే విధిస్తున్నట్లు పేర్కొంది. తాజాగా హైకోర్టు ఆర్డర్‌పై కౌంటర్ పిటీషన్ వేసేందుకు పలువురు ప్రతివాదులు సిద్ధమౌతున్నట్లు సమాచారం. కాగా తొలగించబడినవారిలో ముగ్గురు ఉద్యోగులు సైతం హైకోర్టు గడప ఎక్కినట్లు తెలిసింది. ఇదిలావుండగా, మరోవైపు వచ్చేనెల 6వ తేది నుంచి చిత్తూరు డీఎల్‌సీవో కార్యాలయంలో జరగాల్సిన సహకార చట్టం 60-1 సెక్షన్ విచారణ కూడా నిలిపివేస్తున్నట్లు సమాచారం.

ముగిసిన సోమవారోత్సవాలు





సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద భక్తజనసందోహం - సోమవారోత్సవ శోభలో సుబ్రహ్మణ్యస్వామి

రామకుప్పం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): రామకుప్పం శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వార్షిక సోమవారోత్సవాలు వైభవంగా ముగిశాయి.పురోహితులు స్వామివారి మూలమూర్తికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి, వెండి కవచధారణతో విశేష పుష్పాలంకరణ చేశారు. అనంతరం నెమలి వాహనంపై వళ్లీ, దేవసేన, సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవర్లకు విశేషపూజలు నిర్వహించారు.ఉదయం ఆరు గంటల నుంచే ప్రారంభమైన భక్తజన ప్రవాహం సాయంత్రం 4గంటల వరకు కొనసాగింది.హిందువులతోపాటు పెద్దసంఖ్యలో ముస్లిం భక్తులు కూడా స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఊరేగింపుగా వచ్చి కుండకావళ్లు, పూలకావళ్లు, నెమలి కావళ్లు, వీపుతేర్లు సమర్పించారు.

స్వర్ణరథంలో మెరిసిన మలయప్ప

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం స్వర్ణరథంలో దేవేరులతో కలిసి మలయప్ప ఊరేగారు. 4 నుంచి 5.10 గంటల వరకు స్వర్ణరథంలోని దేవదేవులను భక్తులు దర్శించారు. చల్లని వాతావరణం, మధ్యమధ్యలో చిరుజల్లుల నడుమ బంగారు రథం శోభాయమానంగా సాగింది. ఈ స్వర్ణరథాన్ని మహిళలు మాత్రమే లాగడం విశేషం. భారీ సంఖ్యలో మహిళలు పాల్గొని గోవిందనామస్మరణలతో స్వర్ణరథం మోకులను పట్టుకుని లాగారు. భక్తులు, శ్రీవారి సేవకులు, అప్పుడప్పుడు భద్రతా సిబ్బంది సహకరించడంతో స్వర్ణరథోత్సవం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం హనుమంత, రాత్రి గజ వాహనాలపై శ్రీవారు దర్శనమిచ్చారు. ఆయా వాహన సేవల్లో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



సంప్రదాయ నృత్య నీరాజనం

కేరళ యక్షగానం, పాండిచ్చేరి ఫోక్ డ్యాన్సు, మైలట్లం, కర్ణాటక పిన్నాల్ అండాళ్ డ్యాన్స్, తెలంగాణ బృందం కోలాటం, ఢిల్లీ కళాకారుల చౌమయూర్ బంజ్, జమ్ము కశ్మీర్ రౌఫ్, పంజాబ్ లూధి నృత్యాలు.. ఇలా సోమవారం ఉదయం 26 కళా బృందాల్లోని 607 మంది కళాకారులు హనుమంత వాహనం ముందు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. ఒడిశా సంబల్పూడి గౌటిపు, మహారాష్ట్రకు సంబంధించి గోందళ్ నృత్యాలతో పాటు శ్రీరామ పట్టాభిషేకం, రామావతారం వంటి పౌరాణిక ఘట్టాలను నృత్య రూపకం ద్వారా ప్రదర్శించారు. ఇక, రాత్రి గజ వాహన సేవలో కర్ణాటక కళాకారుల గజేంద్ర వైభవం, బంజారా నృత్యం, తిరుపతి కళాకారుల మయూర నృత్యం, కోలాటం, గజేంద్రమోక్షం వంటి సంప్రదాయ నృత్యాలు.. తెలంగాణ కళాకారుల పేరిణి.. ఒడిశా కళాకారుల ఒడిస్సీ నృత్య ప్రదర్శనలు కళా వైభవాన్ని చాటాయి. కీలుగుర్రాల ప్రదర్శన, అష్టలక్ష్మి వైభవం, భరతనాట్య ప్రదర్శనలు భక్తులకు కనువిందు చేశాయి.

- తిరుమల(కల్చరల్), ఆంధ్రజ్యోతి

రికార్డుస్థాయిలో భక్తుల 'ఘాట్' ప్రయాణం

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాలలో గరుడసేవ రోజున రికార్డు స్థాయిలో ఆర్టీసీ బస్సుల్లో భక్తులు ఘాట్‌లో ప్రయాణించారు. ఆదివారం పూర్తిగా 425బస్సులు.. తిరుమల- తిరుపతి మధ్య 5,642 ట్రిప్పులు తిరిగి.. 2,16,753మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాయి. నిమిషానికో బస్సు ఏర్పాటుచేసి సీబీఎస్, రైల్వే స్టేషన్, ఇతర పార్కింగ్ స్థలాల నుంచి భక్తులను తిరుమలకు.. అక్కడ్నుంచి మళ్లీ తిరుపతికి చేర్చారు. కాస్త గతేడాదికంటే దాదాపు 30వేల మందికి అదనంగా రవాణా సౌకర్యం కల్పించడం విశేషం. ఆ ఒక్క రోజులో తిరుమల ఘాట్ ద్వారా ఆక్యుపెన్సీ రేషియో 79శాతం నమోదుకాగా, టికెట్ల ద్వారా రూ.1.8కోట్లు వచ్చింది. ఆర్టీసీ అధికారులను, సిబ్బందిని ప్రజా రవాణాధికారి జగదీష్ అభినందించారు.

సిక్కిం విద్యార్థుల 'మరోని' నృత్యార్చన

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో తొలిసారిగా సిక్కిం బృందం ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ప్రకాష్ ఆధ్వర్యంలో 10 మంది విద్యార్థులు, ఉద్యోగులు 'మరోని' అనే నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. ఈ కళాకారుల్లో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్స్ మెడిసిన్ చదువుతున్న విద్యార్థులతో పాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులూ ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



వాహన సేవలకు అశ్వాలు దూరం

తిరుమల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఈసారి శ్రీవారి బ్రహ్మోత్సవాల్లోని వాహనసేవలకు అశ్వాలు(గుర్రాలు) దూరమయ్యాయి. తొలిరోజు పెద్దశేషవాహనం, మరుసటి రోజు చిన్నశేషవాహన సేవల మినహా మిగిలిన సేవల్లో ఇవి కనిపించలేదు. ఉత్సవ క్రమంలో రెండు గుర్రాలు బెదిరాయి. కొన్నిసార్లు శబ్దాలు కూడా చేశాయి. దీంతో అధికారులు ముందస్తు జాగ్రత్తగా వీటిని గోశాలకు పరిమితం చేశారు. అశ్వవాహన సేవకు మాత్రమే తీసుకువచ్చేలా ప్రణాళికలు రూపొందించుకున్నారు. వైష్ణవి, పద్మావతి అనే రెండు ఏనుగులు కూడా రెండు రోజుల పాటు విశ్రాంతి తీసుకున్నాయి. అయితే గరుడవాహన సేవ నుంచి రెండూ పాల్గొంటున్నాయి.

బాలుడి అప్పగింత



తిరుమల(కల్చరల్), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) : తిరుమలలో తప్పిపోయిన ఏడేళ్ల బాలుడిని పోలీసులు అతడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుప్పం మండలం కెకెతొండ ప్రాంతానికి చెందిన మురుగేష్ కుటుంబం సోమవారం తిరుమలకు వచ్చింది. అఖిలాండం వద్ద మధ్యాహ్నం రద్దీలో మురుగేష్ కుమారుడు చైతన్య నాయక్ తప్పిపోయాడు. వీరు వెంటనే పోలీసులను ఆశ్రయించారు. డిజిటల్ చైల్డ్ ట్యాగ్ సిస్టమ్ ద్వారా ఈ బాలుడిని గుర్తించి ఎస్పీ సుబ్బరాయుడు సమక్షంలో తల్లి హంసకు అప్పగించారు.

రైల్వే సిబ్బంది మధ్య కరువైన సమన్వయం

- మోటకంపల్లె వద్ద పట్టాలు తప్పిన టవర్‌కార్
- ఆరేడుగంటలు ఆగిపోయిన పలు రైళ్లు



పూతలపట్టు/చిత్తూరు రూరల్/పాకాల/తిరుపతి సెంట్రల్,సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): చిత్తూరు-తిరుపతి రైలుమార్గంలో సోమవారం ఓ టవర్ కార్ పట్టాలు తప్పి పలు రైళ్ల రాకపోకలు ఆలస్యం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.పూతలపట్టు -పాకాల స్టేషన్ల మధ్యలో సోమవారం రైల్వే ట్రాక్ మెయింటెనెన్స్ పనులు జరిగాయి.పట్టాలతో పాటు విద్యుత్ లైన్లను సిబ్బంది పరిశీలించేందుకు 11.30గంటలనుంచి 1.30 గంటల దాకా ఇంటిగ్రేటెడ్ బ్లాక్ పేరుతో రాకపోకలను ఆపారు.అయితే 12గంటల సమీపంలో పి.కొత్తకోట సమీపంలోని మోటకంపల్లె వద్ద రైల్వే సిబ్బంది మధ్య సమన్వయం కరువై విద్యుత్ లైన్లు చెక్ చేసే ఓహెచ్ఈ ఇన్‌స్పెక్షన్ కారు ఇంజన్ పట్టాలు తప్పింది. దీంతో తిరుపతి-చిత్తూరు మార్గంలో రాకపోకలు సాగించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ళు ఎక్కడికక్కడ స్టేషన్లలో ఆపేశారు.తిరుపతి స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ ప్రమాద స్థలం వద్దకు వెళ్లారు. రేణిగుంట నుంచి లూకాస్‌ను సంఘటనా స్థలానికి తీసుకెళ్లి ఈహెచ్ఈ ఇన్‌స్పెక్షన్ కారును పట్టాలెక్కించి పాకాలకు తరలించేటప్పటికి సాయంత్రమైంది.రాత్రి 8గంటలకు మరమ్మతులు పూర్తి చేసి రైళ్ల రాకపోకలను అధికారులు పునరుద్ధరించగలిగారు.శబరి,మన్నార్గుడి,వెంకటాద్రి, శేషాద్రి,భువనేశ్వరి, రామేశ్వరం, నాగర్‌కోయిల్,ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు తిరుపతి-కాట్పాడి ప్యాసింజరు తదితర రైళ్లు ఆరేడుగంటలు ఆలస్యంగా నడిచాయి. పూతలపట్టు రైల్వేస్టేషన్‌లో కోయంబత్తూరు నుండి తిరుపతి వెళ్ళే రైలు ఆగిపోవడంతో ప్రయాణికులు పడరాని పాట్లు పడ్డారు. అంతకుముందు మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో రైలు చిత్తూరు స్టేషన్‌లో గంటసేపు ఆగిపోవడంతో ప్రయాణికులు ఆరా తీశారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం ఆగిందని రైల్వే సిబ్బంది చెప్పారు. అదే రైలు పూతలపట్టులో మళ్లీ ఆగిపోవడంతో ప్రయాణికులు రైల్వే సిబ్బందితో వాగ్వాదానికి దిగారు.



టవర్‌కారును పట్టాలపైకి చేరుస్తున్న లూకాస్

దీంతో టవర్ కారు పట్టాలు తప్పిందని, 2-3 గంటలు ఆలస్యం కావొచ్చని రైల్వే సిబ్బంది సమాచారం ఇవ్వడంతో ప్రయాణికులు ఒకటిన్నర కిలో మీటరు దూరం కొంతమంది ఆటోల్లో, కొంతమంది నడుచుకుంటూ చిత్తూరు-తిరుపతి జాతీయ రహదారికి చేరుకొని బస్సుల్లో గమ్యస్థానాలకు చేరుకున్నారు.బెంగళూరు-తిరుపతి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 12 గంటల నుంచి పూతలపట్టు రైల్వే స్టేషన్‌లో నిలిచిపోయింది.మన్నార్‌గుడి-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌ను మధ్యాహ్నం 1-30 నుంచి చిత్తూరులోనే ఆపేశారు. రామేశ్వరం-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌ను పాకాలలో నిలిపివేశారు. పాకాలకు సాయంత్రం 4 గంటలకు రావలసిన కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్‌ను ముంగిలిపట్టులోనే ఆపేశారు. శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌ను కాట్పాడిలో,హౌరా ఎక్స్‌ప్రెస్‌ను రామాపురంలో, తిరుపతి-కాట్పాడి, కాట్పాడి తిరుపతి డెము రైళ్లను నిలిపివేశారు. రాత్రి 8 గంటల వరకూ అవస్థలు పడిన ప్రయాణికులు తర్వాత లైన్ క్లియర్ చేయడంతో ఊపిరి పీల్చుకున్నారు.



తిరుపతి స్టేషన్‌లో ప్రయాణికుల పడిగాపులు



పూతలపట్టు స్టేషన్ నుంచి నడిచివచ్చి బస్సెక్కుతున్న ప్రయాణికులు



పాకాల రైల్వే స్టేషన్‌లో నిలిచిపోయిన రామేశ్వరం ఎక్స్‌ప్రెస్

కుటుంబమంతా అంబేడ్కర్ వర్సిటీ విద్యార్థులే!

- ఐదుగురికీ ఒకే విశ్వవిద్యాలయం నుంచి పట్టాలు
- వారిలో నేడు స్నాతకోత్సవంలో గోల్డ్ మెడల్ అందుకోనున్న తిరుపతికి చెందిన గాయత్రి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వారంతా ఒకటే కుటుంబం. భార్యాభర్తలు, వారికి ముగ్గురు సంతానం. పలు కారణాలతో సంప్రదాయ ఉన్నత విద్యకు దూరమైన వీరంతా డా.బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం విద్యార్థులుగా.. తమ లక్ష్యమైన ఉన్నత విద్యను అభ్యసించారు. వీరిలో తాజాగా పీజీ పూర్తి చేసిన ఒకరు మంగళవారం జరిగే స్నాతకోత్సవంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకోనున్నారు. తిరుపతికి చెందిన ఎస్.శ్రీధర్ అనే వ్యక్తి టీటీడీలో ఒక చిరుద్యోగి. ఆయనకు ఉన్నత విద్య చదవాలని లక్ష్యం, కానీ అందుకు పరిస్థితులు అనుకూలించలేదు. కుటుంబ స్థితిగతుల నేపథ్యంలో చిన్న ఉద్యోగంలో చేరి ఆ తర్వాత వివాహం, పిల్లలు, వారి పోషణతో సరిపోయింది. అయినా ఉన్నత విద్యపై ఉన్న ఆసక్తికి అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వేదికైంది. కుటుంబ స్థితిగతులు కొంత మెరుగయ్యాక అక్కడ ఆయన గతంలో ఓపెన్ విద్య విధానంలో డిగ్రీలో పూర్తి చేశారు. శ్రీధర్ భార్య ఉమాదేవికి కూడా ఉన్నత విద్యపై మక్కువే. చదువుపై ఆసక్తి ఉన్నా పిల్లల పెంపకం అడ్డంకిగా మారింది. అయినా అడ్డంకులను ఛేదించుకొని.. తన భర్త బాటలోనే అదే వర్సిటీలో డిగ్రీలో చేశారు. కుమారుడు కార్తీక్ కూడా సార్వత్రిక విద్యాలయం నుంచి ఎం.కామ్ పూర్తి చేసి అధ్యాపకుడిగా కొనసాగుతున్నారు. పెద్దకుమార్తె ఎస్.విద్య సైతం ఇదే వర్సిటీలో ఎమ్మెస్సీ సైకాలజీ పూర్తిచేశారు. చిన్న కుమార్తె ఎస్.గాయత్రి తాజాగా అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం తిరుపతి అధ్యయన కేంద్రంలో ఎం.కామ్ పూర్తి చేసి, ఉత్తమ ప్రతిభతో బంగారు పతకానికి ఎంపికయ్యారు. లక్ష్యాన్ని నిర్దేశించుకున్న తర్వాత వెనుకడుగు వేయొద్దని ఆమె అంటున్నారు. పోటీపరీక్షలకు సిద్ధమవుతూ ఎం.కామ్ చదివానని తెలిపారు.



అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో చదువుకున్న తిరుపతికి చెందిన కుటుంబం

టీటీడీకి సీఎం అభినందనలు

'తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో అత్యంత విశిష్టమైన మలయప్ప స్వామి గరుడవాహన సేవ కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన టీటీడీకి అభినందనలు' అంటూ సీఎం చంద్రబాబు ఆదివారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. శ్రీవారి ఆలయం, గరుడ వాహనసేవ, శ్రీవారి సేవకుల సేవలు, భక్తుల ఫొటోలను తన పోస్ట్‌కు జత చేశారు. గరుడ సేవకు తరలివచ్చిన 3 లక్షల మందికిపైగా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి వారికి మంచి అనుభూతిని మిగిల్చారని కొనియాడారు. బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించడంలో కీలకపాత్ర పోషించిన, సమన్వయంతో వ్యవహరించిన టీటీడీ బోర్డు, దేవస్థానం అధికారులు, ఉద్యోగులు, శ్రీవారి సేవకులు, జిల్లా అడ్మినిస్ట్రేషన్, పోలీసులకు అభినందనలు తెలిపారు. 'తిరుమల కొండ పవిత్రతను కాపాడుతూ బ్రహ్మోత్సవాల్లో పాల్గొని తరించిన భక్తకోటికి ధన్యవాదాలని పోస్ట్ చేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

3నుంచి కొత్త ఉపాధ్యాయులకు శిక్షణ

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మెగా డీఎస్సీ 2025 ద్వారా కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయులకు అక్టోబరు మూడు నుంచి పదో తేదీ వరకు శిక్షణ నిర్వహించనున్నట్లు డీఈవో వరలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన ఉపాధ్యాయులు మూడో తేదీన ఉదయం ఏడు గంటలకు వారికి కేటాయించిన కేంద్రాల్లో శిక్షణ తరగతులకు హాజరు కావాలన్నారు. వంద శాతం హాజరు తప్పనిసరిగా ఉండాలని, ఎవరికీ ఎలాంటి మినహాయింపు లేదని పేర్కొన్నారు. ఆలస్యంగా హాజరైనా? ముందే వెళ్లిపోయినా వారిని గైర్హాజరుగా పరిగణించనున్నట్లు తెలిపారు. అపాయింట్‌మెంట్ ఆర్డర్‌తోపాటు లేటెస్టు ఆండ్రాయిడ్ ఫోన్ తేవాలని సూచించారు. వ్యక్తిగతంగా అవసరమైన మందులు, శిక్షణ జరిగే రోజులకు సరిపడా దుస్తులు, ఇతర వ్యక్తిగత వస్తువులు వెంట తెచ్చుకోవాలన్నారు. ● స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ, తమిళం, హిందీ) అభ్యర్థులు.. చిత్తూరు ఆర్‌వీఎస్ నగర్, ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలోని శిక్షణ కేంద్రానికి హాజరు కావాలన్నారు. ● స్కూల్ అసిస్టెంట్ (గణితం, ఫిజిక్స్, బయాలజీ, అన్ని మాధ్యమాలు) అభ్యర్థులకు చిత్తూరు కట్టమంచిలోని వెంకుస కళ్యాణ మండపం పక్కన ఉన్న ఆర్కే ఇంటర్నేషనల్ స్కూల్లో శిక్షణ ఉంటుందన్నారు. ● స్కూల్ అసిస్టెంట్ (సోషియల్ స్టడీస్, ఫిజికల్ ఎడ్యుకేషన్, అన్ని మాధ్యమాలు) అభ్యర్థులకు తిరుపతి చిగురువాడలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ● సెకండరీ గ్రేడ్ టీచర్స్ (అన్ని మాధ్యమాలు) అభ్యర్థులకు తిరుపతి జీవకోనలోని విశ్వం స్కూల్, మెడ్జీ స్కూల్, గూడూరు అరవింద నగర్ బైపాస్ రోడ్డులోని ఆదిశంకర ఇంజనీరింగ్ కాలేజీలో శిక్షణ తరగతులు ఉంటాయన్నారు.

కార్పొరేట్ సెలూన్లతో నష్టపోతున్నాం

చిత్తూరు నాయీ బ్రాహ్మణ సేవా సంఘం



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులు

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సెలూన్ల వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని చిత్తూరు నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. గతంలో తాము ఒక యూనియన్‌గా ఉండి సెలూన్లలో ఒక ధర నిర్ణయించేవారమని చెప్పారు. కార్పొరేట్ సెలూన్ల వారు కేవలం రూపాయికే హెయిర్ కటింగ్ అని, రూ.30కే షేవింగ్ అని తమ వృత్తిని కించపరిచేలా, వ్యాపారాన్ని దిగజార్చుతున్నారన్నారు. ఇకపై నగరంలో కొత్త కార్పొరేట్ సెలూన్లకు అనుమతి ఇవ్వకుండా చూడాలని కోరారు. అలాగే నాయీ బ్రాహ్మణులకు నెలకు రూ.20వేల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందించి ఆదుకోవాలని కోరారు. కార్పొరేట్ సెలూన్ల ముందు ఆఫర్ ధరల పట్టికను తొలగించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే నాయీ బ్రాహ్మణులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

తక్కువ వడ్డీకే రైతులకు బంగారంపై రుణాలు

● డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి



సమావేశంలో ప్రసంగిస్తున్న కమిషనర్ నరసింహప్రసాద్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): 'చిన్న, సన్న తరగతి రైతాంగానికి బంగారం కుదువపై తక్కువ వడ్డీకే రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. సోమవారం నుంచే ఈ నిర్ణయం అమలు చేస్తున్నాం'అని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి తెలిపారు. సోమవారం బ్యాంకు ప్రధాన కార్యాలయంలో బోర్డు మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు వ్యాపారం చేస్తున్న 42 సొసైటీల్లో బంగారం కుదువపై 9-9.5 శాతం వడ్డీ వసూలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ సూచనల మేర ఆప్కాబ్ వడ్డీ రేట్లను సవరించిందని చెప్పారు. ఆ మేరకు 9.25 శాతం నుంచి 7.95 శాతానికి వడ్డీ తగ్గించి సోమవారం నుంచే అమల్లోకి తెస్తూ ఆదేశాలు ఇచ్చామన్నారు. బంగారం కుదువ వ్యాపారం సమర్థవంతంగా చేస్తున్న 22 సొసైటీలను గుర్తించి అక్కడి వ్యాపారాభివృద్ధికి అదనంగా మరో రూ.100 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలో బ్యాంకు సీఈవో శంకర్ బాబు అజెండా వివరాలను తెలిపారు. నాబార్డు డీడీఎం సునీల్, ఆప్కాబ్ డీజీఎం షఫీ, డీసీవో లక్ష్మి, ఇతర బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

ప్రజల్లోకి 'సూపర్ జీఎస్టీ'ని తీసుకెళ్లాలి

● వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ రవీంద్రనాథరెడ్డి

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు 'సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్'ను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ రవీంద్రనాథరెడ్డి, కమిషనర్ నరసింహప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ఈ అంశంపై ఆర్పీలు, సీవోలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నూతన జీఎస్టీపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఇందుకోసం షెడ్యూల్ ప్రకారం అన్ని వార్డుల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. వాణిజ్య పన్నుల శాఖ సహాయ కమిషనర్ పరదేశి నాయుడు, అసిస్టెంట్ కమిషనర్ మహేష్‌కుమార్, సహాయ కమిషనర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మాకు ఉద్యోగ భద్రత కల్పించండి

● రెస్కో పాలకవర్గానికి 17మంది ఉద్యోగుల విన్నపం

కుప్పం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కుప్పం రెస్కోలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని 17 మంది ఉద్యోగులు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు, పాలకవర్గ చైర్మన్ వీజీ ప్రతాప్‌కు, ఎండీ సోమశేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు. కుప్పంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ ఆవరణలో సోమవారం రెస్కో మహాజన సభ జరిగింది. వైసీపీ అయిదేళ్ల పాలనలో రెస్కోలో జరిగిన అవినీతి, ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల్లో చోటుచేసుకున్న అవకతవకలపై జరిగిన శాఖాపరమైన విచారణ నివేదికను ఈ సమావేశంలో సమర్పించారు. ఈ సందర్భంగా 17 మంది ఉద్యోగులు ఎమ్మెల్సీని, రెస్కో పాలకవర్గ చైర్మన్‌ను, ఎండీని కలిశారు రెస్కోలో తమ 17 మంది ఉద్యోగులు 2012 నుంచి పనిచేస్తున్నట్లు వారు గుర్తు చేశారు. అప్పట్లో ఓచర్ల ద్వారా జీతాలు ఇచ్చేవారన్నారు. 2014 నుంచి 2016 దాకా ఎటువంటి జీతభత్యాలు లేకపోయినా విధులకు సక్రమంగా హాజరవుతూ వచ్చామన్నారు. తర్వాత తమ సేవలను గుర్తించిన అప్పటి పాలకమండలి, అధికారులు రూ.6,500, రూ.10,500, రూ.13,500లను వేతనాలుగా చెల్లించారని చెప్పారు. తర్వాత 2022వ సంవత్సరం అక్టోబరు 1వ తేదీన తమందరికీ కన్సాలిడేషన్ వేతనాలు ఇచ్చారన్నారు. అనంతరం విద్యార్హతలను పరిగణనలోకి తీసుకుని 2024వ సంవత్సరం ఫిబ్రవరి 1న 17 మందిలో ఇద్దరికి సబ్ ఇంజనీర్లుగా, 7 మందికి జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించారని తెలిపారు. తమ దీర్ఘకాల సేవలను పరిగణనలోకి తీసుకుని, రెస్కోలో ఉద్యోగ భద్రత కల్పించాలని 17 మంది ఉద్యోగులు విన్నవించారు.

కలెక్టరేట్ 'పీజీఆర్ఎస్'కు 292 అర్జీలు



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి):కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు 292 అర్జీలు అందాయి. బాధితుల నుంచి అర్జీలను కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి, ఇతర అధికారులు స్వీకరించారు. అర్జీల వివరాలు శాఖల వారీగా.. రెవెన్యూ, సర్వే శాఖలకు సంబంధించి 204, పోలీసుశాఖకు 6, పంచాయతీరాజ్‌కు 5, డీఆర్‌డీఏకు 28, పశు సంవర్ధకశాఖకు 12, విద్యాశాఖకు 5, రిజిస్ట్రేషన్, స్టాంపులశాఖకు 4, గృహ నిర్మాణ శాఖకు 3 చొప్పున అందగా.. విద్యుత్‌శాఖ, ఇరిగేషన్, ఎంప్లాయిమెంట్, ఇరిగేషన్, గంగవరం ఎంపీడీవోలకు 25 అర్జీలు అందాయి.

పొలాలకు దారిలేకుండా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

పొలాలకు వెళ్లకుండా దారి లేకుండా చేస్తున్న అగ్రకులస్తులపై చర్యలు తీసుకోవాలని పెనుమూరు మండలం శాతంబాకం దళితవాడకు చెందిన ప్రజలు కోరారు. పొలాలకు వెళ్లడానికి స్కెచ్‌లో దారి ఉన్నప్పటికీ అగ్రకులస్తులు ఆక్రమించుకున్నారని, అడిగిన తమపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని సురేష్ కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణదారులకు రెవెన్యూ అధికారులు అండదండలు ఉన్నాయని ఆరోపించారు.

దళిత మహిళకు న్యాయం చేయాలి

గంగవరం మండలం బూడిదిపల్లె దళిత మహిళ మునెమ్మకు న్యాయం చేయాలని సోమవారం కలెక్టరేట్ వద్ద కేవీపీఎస్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు మాట్లాడుతూ.. గ్రామంలో తోట పనులకు రాలేమని చెప్పిన మునెమ్మ కుటుంబంపై పెత్తందార్లు దౌర్జన్యానికి దిగి ఆమెకు చెందిన రేకుల షెడ్డును తొలగించారన్నారు. రెవెన్యూ అధికారులు కూడా స్థానిక నాయకుల మాటలు విని.. బాధితురాలి కుటుంబాన్ని పట్టించుకోలేదన్నారు. కలెక్టర్ చెప్పినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. మునెమ్మకు రేకుల షెడ్డుకు బదులు వేరేచోట స్థలాన్ని ఇస్తామని చెప్పినా ఇవ్వలేదన్నారు. అధికార యంత్రాంగం బాధితురాలికి న్యాయం చేయకుంటే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

గ్రామ బహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

గ్రామ బహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని యాదమరి మండలం బుడితిరెడ్డిపల్లెకు చెందిన మూడు ముస్లిం కుటుంబాలు డిమాండ్ చేశాయి. బహిష్కరణకు గురైన ముస్లిం కుటుంబాలతో కలిసి సీపీఐ నేతలు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ మాట్లాడుతూ.. ముస్లిం కుటుంబానికి చెందిన ఓ యువతి వేరే కులానికి చెందిన యువకుడిని పెళ్లి చేసుకుందనే నెపంతో మూడు కుటుంబాలను గ్రామపెద్దలు బహిష్కరించారన్నారు. ఈ విషయాన్ని ఆ పంచాయతీ సర్పంచ్, మాజీ సర్పంచ్‌లతోపాటు ముస్లిం మత పెద్దల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. నాగరిక సమాజంలో ఉన్నామన్న విషయాన్ని మరిచిపోయి వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కార్పొరేట్ సెలూన్లను నియంత్రించాలి

జిల్లాలో కార్పొరేట్ సెలూన్లను నియంత్రించాలని నాయీ బ్రాహ్మణ సంఘం నేతలు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ముందు నాయీ బ్రాహ్మణ సంఘం నేతలు నిరసన తెలిపారు. చిత్తూరు నగరంతోపాటు జిల్లాలో కార్పొరేట్ సెలూన్లు పుట్టగొడుగుల్లా వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి కారణంగా కులవృత్తినే నమ్ముకున్న తాము ఉపాధిని కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

తేనబండ ప్రజలను ఇబ్బందులు పెట్టొద్దు

గుడిమాన్యంలో ఇండ్లు కట్టుకున్న తమపై ఎలాంటి చర్యలకు పాల్పడవద్దని చిత్తూరు తేనబండవాసులు కోరారు. 50 ఏళ్లకు ముందు నుంచే ముత్యాలమ్మ ఆలయమాన్యం భూముల్లో ఇండ్లు కట్టుకున్నామన్నారు. ఇప్పుడు ఇండ్లను ఖాళీ చేయాలని ఎండోమెంట్ అధికారులు నోటీసులు ఇచ్చారన్నారు. మాన్యం భూములకు సంబంధించి పన్నుల రూపంలో కట్టాల్సిన డబ్బులను కడతామని తెలిపారు. కాగా, తల్లిదండ్రులతో కలిసి వచ్చిన చిన్నారులంతా పీజీఆర్ఎస్ హాలు ముందు జరిగిన అన్నదాన కార్యక్రమంలో భోజనం చేసి, ఆకలి తీర్చుకున్నారు.



పీజీఆర్ఎస్ హాలు ముందు భోజనాలు తింటున్న చిన్నారులు

పోలీసుశాఖకు 41 అర్జీలు



అర్జీని పరిశీలిస్తున్న ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాష

జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు జిల్లా నలుమూలల నుంచి 41 అర్జీలు అందాయి. బాధితులు నుంచి అర్జీలను ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాష స్వీకరించారు. చీటింగ్‌పై ఒకటి, కుటుంబ తగాదాలపై నాలుగు, వేధింపులపై ఏడు, ఇంటి తగాదాపై ఒకటి, భర్త వేధింపులపై మూడు, భూ తగాదాలపై ఎనిమిది, డబ్బు తగాదాలపై ఎనిమిది, చిన్న తగాదాపై ఒకటి, ఆస్తి తగాదాలపై ఏడు, దారి తగాదాపై ఒకటి చొప్పున అందాయి.

ప్రజా సంక్షేమమే గల్లా కుటుంబ ధ్యేయం



కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీ మోహన్, మాజీ ఎంపీ గల్లా జయదేవ్

తవణంపల్లె, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే గల్లా కుటుంబ ధ్యేయమని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ అన్నారు. గల్లా జయదేవ్ గుంటూరు ఎంపీగా ఉన్నప్పుడు విడుదల చేసిన రూ20లక్షలతో తవణంపల్లె మండలంలోని దిగువమాఘం దళితవాడలో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని సోమవారం మాజీ ఎంపీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల పురోగతినే గల్లా కుటుంబం లక్ష్యంగా పెట్టుకొన్నదని చెప్పారు. శ్రమను నమ్మి జీవించాలన్నదే వారి విశ్వాసమన్నారు. జయదేవ్ మాట్లాడుతూ.. ప్రజల అవసరాలు గుర్తించి పరిష్కరించడంలో ఎంతో ఆనందం కలుగుతుందన్నారు. గ్రామాభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేష్ చౌదరి, ఐరాల మండల అధ్యక్షుడు గంగారపు హరిబాబు, బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ నాయుడు, తవణంపల్లె సింగిల్‌విండో చైర్మన్ అమరేంద్ర నాయుడు, స్థానిక సర్పంచ్ గోపి, నాయకులు గాలి దిలీప్ కుమార్, ప్రవీణ్‌కుమార్, మధు, కుమార్ నాయుడు, ధనంజయ నాయుడు, రఘపతి, శ్రీనువాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంటలపై ఆగని గజదాడులు

వరి, కొబ్బరి, మామిడిచెట్ల ధ్వంసం ● ఆందోళనలో అన్నదాతలు



కొబ్బరిచెట్లను పెకిలించిన ఏనుగులు - ధ్వంసమైన మామిడిచెట్లు

కల్లూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై గజదాడులు ఆగడంలేదు. పగలంతా అడవిలో ఉంటున్న ఏనుగుల గుంపు రాత్రి వేళలో పంటలను ధ్వంసం చేస్తూ నానా బీభత్సం సృష్టిస్తున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలపై చేస్తున్న ఏనుగుల గుంపు దాడులను అరికట్టేవారే లేరా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని దేవళంపేట, కల్లూరు, పాళెం పంచాయతీల్లో ఆదివారం రాత్రి ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేయడంతో అపారనష్టం వాటిల్లింది. ఆదివారం రాత్రి చీకటిపడే సమయానికే తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని చాకలికోన నుంచి బయలుదేరిన 9 ఏనుగుల గుంపు దేవళంపేట పంచాయతీ కుమ్మరిపల్లి వద్దకు చేరుకొని యోగానందంకు చెందిన పశుగ్రాసాన్ని తినేశాయి. పాళెం శంకర్‌కు చెందిన వరిపంటను ధ్వంసం చేసిన ఏనుగులు కల్లూరు-పులిచెర్ల రోడ్డును దాటుకొని కొంగరవారిపల్లి వద్దకు చేరుకున్నాయి. గ్రామంలోని రైతులు శరత్‌నాయుడు, మునిశంతన్‌నాయుడుకు చెందిన కొబ్బరిచెట్లను పెకిలించాయి. అక్కడి నుంచి పీలేరు రోడ్డు వైపు అడుగులు వేసి కల్లూరులోని రైతు రహీంకు చెందిన మామిడి, పీలేరులోని రైతు మాబాషాకు చెందిన కొబ్బరిచెట్లను ధ్వంసం చేశాయి. అక్కడి అడవిలోకి తిరుగుముఖం పట్టిన ఏనుగులు కోటపల్లి సమీపంలోని కల్లూరుకి చెందిన సయ్యద్‌బాషాకు చెందిన వరిపంటను ధ్వంసం చేసి అడవిలోకి చేరుకున్నాయి. సోమవారం పగలంతా సూరప్పచెరువు సమీపంలో ఏనుగుల గుంపు తిష్ట వేసినట్లు అటవీశాఖ సిబ్బంది తెలిపారు.

ఎర్రచందనం చెట్లను పరిశీలించిన సీసీఎఫ్




ఎర్రచందనం చెట్లను పరిశీలిస్తున్న సీసీఎఫ్ యశోదాబాయి, డీఎఫ్‌వో సుబ్బరాజు తదితరులు - రికార్డులను పరిశీలిస్తున్న సీసీఎఫ్ యశోదాబాయి

కల్లూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలోని ఈ.రామిరెడ్డిగారిపల్లి, ఎర్రపాపిరెడ్డిగారిపల్లి, కమ్మపల్లి, దేవళంపేట, కావేటిగారిపల్లి, రాయవారిపల్లి, మంగళంపేట పంచాయతీల్లో తమ పట్టా భూముల్లో ఉన్న ఎర్రచందనం చెట్లను నరికేందుకు అటవీశాఖ అధికారులకు సంబంధిత రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం చిత్తూరు డీఎఫ్‌వో సుబ్బరాజుతో కలిసి అనంతపురం చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సీసీఎఫ్) యశోదాబాయి పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎర్రచందనం వృక్షాలను నరికేందుకు రైతులు దరఖాస్తు చేసుకోవడంతో అనుమతులు మంజూరు చేసేందుకు స్వయంగా సీసీఎఫ్ యశోదాబాయి పరిశీలించారు. ఎర్రచందనం చెట్లను సిబ్బందితో కొలతలు తీయించారు. వీరివెంట ఎఫ్‌ఆర్‌వో థామస్ సుకుమార్, ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫి, ఎఫ్‌బీవోలు మధు, కృష్ణమూర్తి, విజయ్‌భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.



దొడ్డి అనంతాపురం వద్ద చదును చేసిన గుట్ట పోరంబోకు - తాళంబేడులోని ప్రభుత్వ భూమిలో మామిడి చెట్ల పెంపకం



హద్దూపద్దూలేని భూఆక్రమణలు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలో భూ ఆక్రమణలు ఆగడం లేదు.ఈ మండలం మీదుగా రెండు జాతీయ రహదారులు వెళ్తుండడంతో భూ విలువ బాగా పెరిగింది.దీంతో కొండ, గుట్ట, చెరువు, కాలువ....దేన్నీ వదలకుండా కబ్జా చేసేస్తున్నారు.తాజాగా తాళంబేడు పంచాయతీలో 18 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది.దొడ్డి అనంతాపురానికి చెందిన వ్యక్తి ఆదివారం కొండను చదును చేస్తుంటే గమనించిన స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.సోమవారం తహసీల్దార్ జయప్రకాష్ ఆక్రమణకు గురైన భూమిని పరిశీలించారు.అక్రమార్కులను బైండోవర్ చేసినట్లు తెలిపారు.అలాగే తాళంబేడు గ్రామ లెక్కదాఖలా సర్వే నెం.502లో వున్న 36.91ఎకరాల గుట్ట పోరంబోకులో మూడెకరాలను అదే గ్రామానికి చెందిన వైసీపీ నేత ఒకరు ఆక్రమించుకున్నారు. అంతటితో వదిలిపెట్టకుండా అదే సర్వే నెంబరులో సబ్ డివిజన్ చేసినట్లు రికార్డులను ట్యాంపరింగ్ చేసి సుమారు 1.30 ఎకరాలు, 18 సెంట్లు, 10 సెంట్ల భూమికి డీకేటీ పట్టాలను సృష్టించారు. ఈ బాగోతంపై గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఇది వెలుగులోకి వచ్చింది.

పీహెచ్‌సీల్లో ఎన్సీడీ సెల్ ఏర్పాటుకు చర్యలు

● కలెక్టర్ సుమిత్‌కుమార్



ఢిల్లీ బృందంతో కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీల్లో ఎన్సీడీ (నాన్ కమ్యూనికబుల్ డిసీజస్) సెల్ ఏర్పాటు చేస్తామని, దీనికి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ టీం సహకరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఎన్సీడీపై జిల్లాలో విస్తృతంగా పర్యటించిన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఢిల్లీ) బృందం కలెక్టర్‌తో సమావేశమైంది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజారోగ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయన్నారు. 30 - 70 సంవత్సరాల మధ్య వయస్సు గలవారి మరణాల్లో 52శాతం నాన్ కమ్యూనికబుల్ డిసీజస్ వల్లే ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

'సూపర్ జీఎస్టీ'పై అవగాహన కార్యక్రమాలు: కలెక్టర్



'సూపర్ జీఎస్టీ' కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వచ్చేనెల 19వ తేదీవరకు 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్'పై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్' కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రతి ఇంటికీ వెళ్లి జీఎస్టీ తగ్గింపుతో కలిగే లబ్ధిని తెలియజేయాలన్నారు. ఉద్యానశాఖ డీడీ మధుసూదన్ రెడ్డి, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాలుగు మండలాల్లో తేలికపాటి వర్షం

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గడిచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా నాలుగు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. మండలాల వారీగా.. కుప్పంలో 3.8, రొంపిచెర్లలో 1.4, రామకుప్పం, శాంతిపురం మండలాల్లో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

సెలవులో డీఆర్వో

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) మోహన్‌కుమార్ వ్యక్తిగత కారణాలతో సోమవారం నుంచి వారం రోజుల పాటు సెలవుల్లోకి వెళ్లారు. తిరిగి ఆయన అక్టోబరు ఆరో తేదీన విధుల్లోకి చేరనున్నారు. ఫారెస్టు సెటిల్‌మెంట్ ఆఫీసర్, డిప్యూటీ కలెక్టర్ కరుణకుమారిని ఇన్‌చార్జి డీఆర్వోగా నియమిస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు.

పలమనేరు

కుప్పం/పుంగనూరు

కలిసికట్టుగా టీడీపీ పటిష్ఠతకు కృషి



వెంకటరమణ, ఆనందరెడ్డిలను సన్మానించిన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

రామకుప్పం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): టీడీపీ రామకుప్పం మండల అధ్యక్షుడిగా నియమితుడైన వెంకటరమణ మండల నేతలతో కలిసి సోమవారం కుప్పంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను కలిశారు. ఈ సందర్భంగా వెంకటరమణతోపాటు తాజా మాజీ అధ్యక్షుడు ఆనందరెడ్డిలను ఎమ్మెల్సీ ఘనంగా సన్మానించారు. సీనియర్, యువనేతలు, కార్యకర్తలతో కలిసికట్టుగా సాగి పార్టీ పటిష్ఠతకు కృషి చేయాలని ఎమ్మెల్సీ సూచించారు. గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, తెలుగుయువత మండల ప్రధానకార్యదర్శి వెంకటాచలం, ఎస్టీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కామరాజనాయక్ నేతలు సత్తి, రామలింగారెడ్డి, కృష్ణారెడ్డి, జేయి, మురళీ, సురేష్, భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చంద్రన్నతోనే వడ్డెర్ల అభివృద్ధి



వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దన్నను సన్మానిస్తున్న మండల టీడీపీ నేతలు

శాంతిపురం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే వడ్డెర్లు అభివృద్ధి చెందుతారని వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పెద్దన్న అన్నారు. సోమవారం అమరావతిలో జరిగిన వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం అనంతరం శాంతిపురం మండల మాజీ టీడీపీ అధ్యక్షులు భాష్యం విశ్వనాథ నాయుడు ఆధ్వర్యంలో పెద్దన్నను ఘనంగా సన్మానించారు. తనపై నమ్మకంతో వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ పదవి అప్పగించినందుకు చంద్రబాబుకు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎంకేపీ ఛైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల టీడీపీ అధ్యక్షులు ఉదయ్ కుమార్‌లకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షులు గోపాల్, నేతలు చంద్రశేఖర్‌రెడ్డి, జైపాల్, జయరామ్, ప్రసాద్, బాలు, బీరేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంతోనే స్వర్ణ కుప్పం సాధ్యం

శాంతిపురం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే స్వర్ణ కుప్పం సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం పేర్కొన్నారు. సోమవారం పెద్దబొమ్మనపల్లె గ్రామ సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... కుప్పం నియోజకవర్గాన్ని స్వర్ణ కుప్పం చేసేందుకు చంద్రబాబు అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. 2029 నాటికి అభివృద్ధి పనులు పూర్తిచేసి స్వర్ణ కుప్పం సాధిస్తారని అన్నారు. ఇందులోనే భాగంగా రూ.41 లక్షలతో కుప్పం-పలమనేరు జాతీయ రహదారి నుంచి పెద్దబొమ్మనపల్లె గ్రామానికి సీఎం నిధులు మంజూరు చేశారన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, విజయరామిరెడ్డి, చంద్రశేఖర్, అనసూయ, పీవీ నాగరాజు, మణి, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో భవానీ

పలమనేరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పలమనేరు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని పలు మండలాల నుంచి వచ్చిన రైతులు రెవెన్యూ సమస్యలపై ఆర్డీవో భవానీకి అర్జీలు సమర్పించారు. భూరీసర్వే, పట్టాదారు పాసుపుస్తకాల్లో పొరబాట్లు, దారిసమస్యలు, ఆర్‌వోఆర్‌లో పొరబాట్లపై వేసిన కేసులు ఏళ్లు గడుస్తున్నా విచారణకు నోచుకోవడం లేదని కొందరు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. తమ భూములకు మరొకరు పట్టాదారు పాసుపుస్తకాలు చేసుకొన్నారని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, ఇకనైనా తమకు న్యాయం చేయాలని బాధితులు ఆర్డీవోకు విన్నవించుకొన్నారు. భూ సమస్యలకు సంబంధించి ఇరువర్గాలు వచ్చిన సందర్భంగా పాసు పుస్తకాలకు సంబంధించి ఆర్‌వోఆర్ కేసు వేసుకొంటే వివాదాలకు సంబంధించి సమగ్ర విచారణ చేసి తదుపరి చర్యలు తీసుకొంటామని ఓ వివాదంలో ఇరువర్గాల వారికి సూచించారు. బాధితుల నుంచి వచ్చిన కొన్ని ఫిర్యాదులను అప్పటికప్పుడు పరిష్కరించేందుకు ఆర్డీవో భవానీ సంబంధిత మండల తహసీల్దార్లకు ఫోన్‌చేసి ఆదేశాలు ఇచ్చారు.

ప్రభుత్వ కార్యాలయాల గేట్లకు తాళాలు వేస్తారా?



రెవెన్యూ అధికారులను నిలదీస్తున్న ప్రజలు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పుంగనూరు ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల ప్రధాన గేట్లకు సిబ్బంది తాళాలు వేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం గ్రీవెన్స్‌డే కావడంతో అధిక సంఖ్యలో రెండు ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చిన ప్రజలు పార్కింగ్ స్థలం లేక కార్యాలయ ఆవరణలో ద్విచక్ర వాహనాలను నిలిపారు. అధికారుల వాహనాలు వెళ్లడానికి వీలులేకుండా ద్విచక్ర వాహనాలు నిలపడం వల్ల కార్యాలయం బయట గేటు ముందు ఉంచిన ద్విచక్ర వాహనాలను తహసీల్దార్ డ్రైవర్ నాగరాజు రోడ్డుకు అడ్డుగా పెట్టడంతో వాహనదారులు ఆయనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద పెట్టనీయకుంటే వాహనాలు ఎక్కడ పార్కింగ్ చేయాలని తహసీల్దార్ రామును ప్రజలు నిలదీశారు. ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ స్థలం చూపాలని అడ్వకేట్ శరత్‌కుమార్, మధుబాబు తదితరులు అధికారుల తీరుకు నిరసన వ్యక్తం చేసి ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

జీఎస్టీ తగ్గింపుతో కుటుంబాలకు ఊరట

బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపు వల్ల కుటుంబాలకు ఊరట కలిగి, తద్వారా స్వయం సహాయక సంఘాల పొదుపుకు మరింత లబ్ధి చేకూరనుందని ఇన్‌చార్జి ఎంపీడీవో ఆనందబాబు అన్నారు. బైరెడ్డిపల్లె వెలుగు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండలసమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ ప్రచారం గురించి వివరించారు. జీఎస్టీ స్లాబ్స్ తగ్గింపు ద్వారా నిత్యావసర సరుకులు, గృహోపకరణాల ధరలు తగ్గి కుటుంబాలపై ఆర్థికభారం తగ్గుతుందన్నారు. సమావేశంలో వెలుగు ఏపీఎం లలిత, సీసీలు, మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

సరస్వతీదేవి అలంకారంలో బోయకొండ గంగమ్మ



చౌడేపల్లె: ప్రత్యేక అలంకారంలో మూలస్థానం అమ్మవారు



పుంగనూరు: సరస్వతి దేవిగా విరూపాక్షి మారెమ్మ



శారదాదేవి అలంకరణలో చౌడేశ్వరీదేవి



వెన్న అలంకరణలో కన్యకాపరమేశ్వరి




కృష్ణావతారంలో కల్యాణ వెంకటరమణుడు



సోమల: తమలపాకుల అలంకరణలో వాసవి

చౌడేపల్లె, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ దసరా మహోత్సవంలో 7వ రోజు సోమవారం సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని రెండు చేతులలో వీణ, ఒక చేతిలో వేదాలు, మరో చేతిలో రుద్రాక్షమాలతో చతుర్భుజాలుగా, పూలతో, స్వర్ణాభరణాలతో, తెల్లని పట్టు వస్త్రాలతో సరస్వతీదేవిగా అలంకరించి, ధూప దీప, నైవేద్యం సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. డార్మిటరీ హాలులో అమ్మవారి ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించి, కలశ స్థాపన చేశారు. అనంతరం ఉభయదారులచే అమ్మవారి మూల మంత్రాన్ని పఠింపజేస్తూ సరస్వతీదేవి విశిష్టతను వివరించారు. మహా గణపతి, ఆదిత్యాది నవగ్రహ, దుర్గ చండీ, మృత్యుంజయేశ్వర, సరస్వతీదేవి హోమాలు నిర్వహించారు. ● పుంగనూరు: స్థానిక కోనేరు వద్ద వెలసిన కల్యాణ వెంకటరమణ స్వామి ఆలయంలో స్వామి వారు కృష్ణావతారం అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. విరూపాక్షిమారెమ్మ సరస్వతీదేవిగా, బజారువీధిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఉదయం వెండికవచం, సాయంత్రం వెన్న అలంకారంలో, ఉత్సవ విగ్రహం సరస్వతీదేవిగా, చదళ్ల చౌడేశ్వరి అమ్మవారు శారదాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవీ, సోమేశ్వరస్వామి ఆలయంలో ప్రసన్నపార్వతీదేవి, భోగనంజుండేశ్వర స్వామి ఆలయంలో పార్వతీదేవి అమ్మవార్లకు అలంకరణలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ● సోమల: మండలంలోని కందూరు కన్యకాపరమేశ్వరి అమ్మవారిని, పత్రపల్లె, సోమల బోయకొండ గంగమ్మ, సోమల గీతా పరమేశ్వరి ఆలయాల్లో పలు రకాల పుష్పాలతో అమ్మవార్లను అలంకరించారు. ● రామకుప్పం: రామకుప్పంలో సరస్వతి అలంకారంలో, ఆనిగానూరులో తమలపాకుల అలంకారంలో వాసవీ కన్యకాపరమేశ్వరి దర్శనమిచ్చారు. కంబాలదేవులపల్లె చౌడేశ్వరమ్మ ఆలయంలో సప్తమాతృకలకు సరస్వతి కుంకుమ అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహించారు. ● బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లెలో ఉన్న బాటగంగమ్మ సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. సల్లాపురెమ్మ ఆలయం, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, గడ్డూరు సల్లాపురెమ్మ ఆలయంలో విశేషాలంకరణతో ప్రత్యేకపూజలు జరిగాయి. ● గంగవరం: మండలంలోని మేలుమాయి క్రాస్‌లో వెలసిన మలాలమ్మ అమ్మవారు సరస్వతి అలంకాలంలో దర్శనమియ్యారు. పరిసరప్రాంత ప్రజలు, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, నాయకులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ● సదుం: జాండ్రపేటలోని రామలింగ చౌడేశ్వరి దేవి కంచి కామాక్షిగా, సదుం గ్రామ దేవత సదుమమ్మ సింహ వాహనంపై రాజరాజేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ● వి.కోట: వి.కోటలో వెలసిన దుర్గమాంబ సరస్వతిదేవిగా దర్శనమిచ్చారు. వి.కోట సీఐ సోమశేఖర్, గంగవరం రూరల్ సీఐ పరశురాంలు దుర్గమ్మను దర్శించుకున్నారు. ధర్మకర్త దామోదర్‌రెడ్డి, కమిటీ సభ్యులు తీర్థ, ప్రసాదాలు అందచేశారు.



రామకుప్పం: సరస్వతిగా వాసవీ కన్యకాపరమేశ్వరి



అనిగానూరులో వాసవీ కన్యకాపరమేశ్వరి



బైరెడ్డిపల్లె: సరస్వతీ దేవిగా బాటగంగమ్మ



గంగవరం: సరస్వతి దేవిగా మలాలమ్మ



సదుం: రాజరాజేశ్వరిగా రామలింగ చౌడేశ్వరి దేవి



వి.కోట: సరస్వతీదేవిగా దుర్గమ్మ



వి.కోటలో వెలసిన దుర్గమాంబ ఆలయంలో అమ్మవారి సేవలో పోలీసు అధికారులు

రెస్కో అభివృద్ధితోనే రైతులు, ఉద్యోగుల భవిష్యత్తు

● మహాజన సభలో వక్తల అభిభాషణ



రెస్కో మహాజన సభలో ప్రసంగిస్తున్న ఛైర్మన్ ప్రతాప్

కుప్పం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో షేర్ హోల్డర్లయిన రైతులు, ఉద్యోగుల భవిష్యత్తు, రెస్కో అభివృద్ధితో ముడిపడి ఉందని పలువురు వక్తలు అన్నారు. అవినీతి, అక్రమాలకు దూరంగా ఉండి, సంస్థను పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కుప్పం గ్రామీణ విద్యుత్తు సహకార సంస్థ(రెస్కో) మహాజన సభ సుమారు 12 ఏళ్ల తర్వాత సోమవారం ఛైర్మన్ వీజీ ప్రతాప్ అధ్యక్షతన జరిగింది. ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రాంగణంలో జరిగిన ఈ సమావేశంలో తొలుత ఛైర్మన్ ప్రతాప్ మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అవినీతి, అక్రమ చర్యలతో రెస్కో పూర్తిగా బలహీనపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెస్కో ఏకంగా రూ.800 కోట్ల రుణాల ఊబిలో కూరుకుపోయిందన్నారు. దీని నుంచి బయట పడడానికి తమ పాలకమండలి శక్తివంచన లేకుండా కృషి చేస్తుందని చెప్పారు. 2021లో ఈఆర్సీ లైసెన్సు రద్దు కావడంతో సబ్సిడీ అనేది లేకుండా విద్యుత్తును యూనిట్‌కు సుమారు రూ.7లకు కొనుగోలు చేసి, వినియోగదారులకు కేవలం రూ.1.90కు విక్రయిస్తున్నామని చెప్పారు. తమ పాలకమండలి ప్రమాణ స్వీకారానికి ఒక రోజు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు ఈఆర్సీ లైసెన్సును పునరుద్ధరించే జీవో ఇచ్చి విద్యుత్తు కొనుగోలు భారాన్ని తగ్గించారంటూ ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. గత వైసీపీ హయాంలో అవసరానికి మించిన ఉద్యోగాలు, అక్రమ పదోన్నతులు కల్పించారని, ఇవి నిబంధనలకు విరుద్ధంగా జరిగాయన్నారు. వినియోగదారులు విద్యుత్తు బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ మనుగడకు తోడ్పడాలని పిలుపునిచ్చారు. సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ కుప్పం రెస్కోను నిలబెట్టి, దాని ద్వారా నియోకవర్గ రైతులకు, ప్రజలకు నాణ్యమైన విద్యుత్తును అందించడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని అన్నారు. అందరూ కలిసికట్టుగా సంస్థను కాపాడి పూర్వ వైభవాన్ని తేవాలని పిలుపునిచ్చారు. ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్. మునిరత్నం మాట్లాడుతూ అవసరానికి మించి ఉద్యోగాలు ఇస్తే ఆర్థిక భారం ఎక్కువై సంస్థ మనుగడకు ప్రమాదం దాపురిస్తుందని హెచ్చరించారు. పీకేఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బీఆర్ సురేశ్ బాబు మాట్లాడుతూ సంస్థ మనుగడకోసం ఒత్తిడిని తట్టుకుని పాలకమండలి నిర్దిష్టమైన కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. రెస్కో డైరెక్టర్ ఎన్ఎస్.తులసీనాథ్ మాట్లాడుతూ రెస్కో మనుగడకు తామంతా పాటుపడుతామని హామీ ఇచ్చారు. రెస్కో వైస్ ఛైర్మన్ విశ్వనాథ్, డైరెక్టర్లు, షేర్ హోల్డర్లు, ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు తదితరులు మహాజన సభలో పాల్గొన్నారు.

పుంగనూరు అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా

పుంగనూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పుంగనూరు మున్సిపాలిటీని అందరి సహకారంతో మరింత అభివృద్ధి చేయడానికి తనవంతు కృషి చేస్తానని మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా పేర్కొన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి ప్రభుత్వ నిధులతోబాటు రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి ఇచ్చిన నిధులతో పలు సమస్యలు పరిష్కరించామని వివరించారు. అనంతరం కౌన్సిలర్ నటరాజ, రహంతుల్లా మాట్లాడుతూ అజెండాలోని అంశాలన్నీ ఏకగ్రీవంగా ఆమోదించినట్లు చెప్పడంతో మున్సిపల్ మీట్ ముగిసింది. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, డీఈఈ మహేశ్, వైస్ ఛైర్మన్లు నాగేంద్ర, లలితమ్మ, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ టాపర్‌కు ప్రశంసాపత్రం



ప్రశంసాపత్రం అందుకుంటున్న దీపక్

సోమల, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): బాపట్లలో సోమవారం జరిగిన కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశంలో టెన్త్ టాపర్‌గా మార్కులు సాధించిన సోమల మండలంలోని పర్వతాల మోహన్ కుమారుడు దీపక్‌ను నిర్వాహకులు అభినందించారు. 2024-25 విద్యా సంవత్సరంలో మండలంలో 580 మార్కులు సాధించినందుకు ఈ విద్యార్థికి ప్రశంసాపత్రాన్ని అందించారు.

సాగునీటి సంఘం మాజీ ఛైర్మన్ కన్నుమూత



రాధాకృష్ణారెడ్డి (ఫైల్ ఫొటో)

రామకుప్పం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం మిట్టపల్లెకు చెందిన పెద్దచెరువు సాగునీటి వినియోగదారుల సంఘం మాజీ ఛైర్మన్ రాధాకృష్ణారెడ్డి సోమవారం మృతి చెందారు. రాధాకృష్ణారెడ్డి రెండు దశాబ్దాల పాటు టీడీపీలో క్రియాశీలకంగా ఉంటూ రెండు దఫాలు సాగునీటి సంఘం ఛైర్మన్‌గా ఉన్నారు. దశాబ్దకాలంగా ఆయన వైసీపీలో కొనసాగుతున్నారు. తీవ్ర అనారోగ్యానికి గురైన ఆయన సోమవారం ఉదయం మిట్టపల్లెలోని తమ స్వగృహంలో కన్నుమూశారు. పలువురు అఖిలపక్ష నేతలు రాధాకృష్ణారెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు.

సదుపాయాల స్వర్గధామంగా కుప్పం మున్సిపాలిటీ

కుప్పం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘాన్ని సదుపాయాల స్వర్గధామంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం అన్నారు. కుప్పం పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశం మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన నాయకులు మాట్లాడుతూ కడా ఆధ్వర్యంలో ప్రత్యేక మాస్టర్ ప్లాన్ సింగపూర్ ప్రతినిధులు రూపొందిస్తున్నారన్నారు. పట్టణాభివృద్ధికి తయారవుతున్న ఈ సమగ్ర ప్రణాళిక దాదాపు పూర్తయిందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి అవసరమైన నిధులు విడుదల చేస్తున్నారని తెలిపారు. పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ తమతమ వార్డు సమస్యలను ప్రస్తావించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన పలు అంశాలను సమావేశంలో ఆమోదించారు. సమావేశంలో కౌన్సిలర్ జిమ్ దాము, ఇతర కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతుకు అందుబాటులో యూరియా

వి.కోట, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): రైతులకు అందుబాటులో యూరియా ఉందని ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామచంద్రనాయుడు అన్నారు. సోమవారం యాలకల్లు రైతు సేవా కేంద్రంలో రైతులకు యూరియాను ఆయన చేతుల మీదుగా అందించారు.

యానాది కాలనీలో పౌరహక్కుల దినోత్సవం

పెద్దపంజాణి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె పంచాయతీ కడపల్లె యానాది కాలనీలో సోమవారం ఎంపీడీవో బాలాజీ పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. గిరిజనులు తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలన్నారు.

సొంత ఆదాయంతో గ్రామీణాభివృద్ధి

పెద్దపంజాణి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) గ్రామీణ ప్రాంతాలు సొంత ఆదాయంతో ఆదర్శవంతమైన అభివృద్ధి సాధించవచ్చునని జిల్లా డీపీఆర్సీ కో-ఆర్డినేటర్ హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం పెద్దపంజాణి ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకుని ప్రజల అవసరాలను తీర్చాలన్నారు. ఎంపీడీవో బాలాజీ మాట్లాడుతూ ఇళ్లు, భవనాలు, వ్యాపారాలు, దుకాణ సముదాయాలు, ఖాళీ స్థలాలు, మార్కెట్ కాంప్లెక్స్‌లు, చేపల చెరువులు తదితరాలు గ్రామ పంచాయతీలకు ఆదాయ వనరులన్నారు. వీటి ద్వారా ఆదాయాన్ని పెంచుకుని గ్రామాభివృద్ధి చేయడం అత్యంత సులభతరమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెప్ప, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా

పలమనేరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం మానవహక్కుల సంఘం అవినీతి నిర్మూలన సంస్థ జిల్లా అధ్యక్షులు మునిరత్నం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపంజాణి మండల కేంద్రంలో నాగరాజరెడ్డి కుటుంబాన్ని అదేమండలం మద్దలకుంట గ్రామానికి చెందిన మునిరెడ్డి కుటుంబసభ్యులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. నాగరాజరెడ్డి కుటుంబానికి రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరారు. అనంతరం వారు ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వాణి, జగదీశ్వరి, నారాయణశెట్టి, అన్నపూర్ణ, అమానుల్లా, శాంతమ్మ, ఆనంద, హనుమప్ప, గంగరాజు, నారాయణప్ప, బాధిత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి



హెడ్ కానిస్టేబుల్ యువరాజు (ఫైల్‌ఫొటో)



యువరాజు కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న కృష్ణమూర్తి గౌడు

పలమనేరు, సెప్టెంబరు 29 (ఆంధ్ర జ్యోతి): పలమనేరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజు స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ యువరాజు(58) గుండెపోటుతో మృతిచెందారు. ఆదివారం రాత్రి ఆయనకు గుండెపోటు రావడంతో చికిత్స కోసం తిరుపతికి తరలించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. విషయం తెలుసుకొన్న జిల్లా గౌడ ఈడిగ సంఘ అధ్యక్షులు మద్దిలేటి కృష్ణమూర్తి గౌడు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారులు విజయశేఖర్, శ్రీనివాసులు, కృష్ణకిషోర్‌రెడ్డిలు యువరాజు స్వగ్రామం బంగారుపాళ్యం మండలం నలగాంపల్లికు వెళ్లి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆయన కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. ఈకార్యక్రమంలో ఈడిగ సంఘ నాయకులు బుస్సా నాగరాజుగౌడు, న్యాయవాది జగదీష్ నాయుడు, పలమనేరు ఎక్సైజ్ సీఐ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి

గుడుపల్లె, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రకృతి వ్యవసాయ విధానం గురించి రైతులకు అవగాహన కల్పించి విస్తృతం చేయాలని ఏఎంసీ ఛైర్మన్ మునిరాజు కోరారు. సోమవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ప్రకృతి వ్యవసాయ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సేంద్రియ వ్యవసాయ కూరగాయలకు, పప్పులకు మార్కెట్‌లో డిమాండ్‌తో ఉందన్నారు. ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం కోసం ఎన్నో ప్రోత్సాహకాలు, మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తుందన్నారు. వీటిపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఎం అమృతవల్లి, ఏవో రాజ్యలక్ష్మి, ఏపీఎం గ్రీటా, మాస్టర్ ట్రైనీ వెంకటరమణ, యూనిట్ ఇన్‌చార్జ్‌లు మునికృష్ణ, శ్రీదేవి, శంకర్‌రెడ్డి, రూప తదితరులు పాల్గొన్నారు.

పాల కలశాల శోభాయాత్రను జయప్రదం చేయండి

వి.కోట, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): వి.కోటలో దుర్గమ్మ ఆలయంలో జరిగే దసరా ఉత్సవాల్లో భాగంగా దుర్గాష్టమి పర్వదినాన మంగళవారం ఉదయం 6 గంటలకు జరిగే పాల కలశాల శోభాయాత్రను జయప్రదం చేయాలని ఆలయ ధర్మకర్త దామోదర్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఏరియా ఆస్పత్రిలో రక్తదానశిబిరం

పలమనేరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఏరియా ఆస్పత్రిలో సోమవారం బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 30 మంది రక్త దానం చేశారు. డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ అన్ని దానాల కన్నా రక్తదానం మిన్న అని చెప్పారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ మమతారాణి, అభివృద్ధి కమిటీ ఛైర్మన్ నాగరాజు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

కల్లూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించినప్పుడే ఆ కుటుంబం అన్ని రంగాల్లో రాణిస్తుందని ఏపీఎం చంద్రమోహన్ తెలిపారు. పులిచెర్ల స్త్రీ శక్తి భవనంలో సోమవారం మండల మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశం ఏర్పాటుచేసి నూతన కార్యవర్గాన్ని ఎంపికచేశారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా తులసి, కార్యదర్శిగా పూర్ణిమ, కోశాధికారిగా పద్మజ ఎంపికయ్యారు. డిప్యూటీ ఎంపీడీవో హరి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, సీసీలు తేజోవతి, వెంకట్రమణ, మహిళలు పాల్గొన్నారు.

పలమనేరులో పవన్ ఓఎస్డీ



పాఠశాల నిర్వాహకులు అందజేసిన జ్ఞాపికతో మధుసూదన్

పలమనేరు, సెప్టెంబరు 29 (ఆంధ్ర జ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఓఎస్డీ మధుసూదన్ సోమవారం పలమనేరుకు వచ్చారు. ఈ సందర్భంగా తాను చదువుకొన్న ప్రైవేటు పాఠశాలను సందర్శించారు. పాఠశాల నిర్వాహకులు శ్రీనివాసులు, సిబ్బంది ఆయనకు జ్ఞాపికను అందజేశారు.

మున్సిపల్ కాంట్రాక్ట్ ఉద్యోగిపై దాడి

● కేసు నమోదు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కాంట్రాక్ట్ ఉద్యోగిపై దాడి చేసి గాయపరిచిన నలుగురిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. సీఐ కథనం మేరకు.. మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్న ప్రభు రెండు రోజుల క్రితం ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళుతుండగా తూర్పుమొగసాలకు చెందిన కార్తీక్, కురవూరుకు చెందిన భాస్కర్, కర్నాటక రాష్ట్రం హెబ్బిణికి చెందిన అరుణ్, రాజులు ఆపి దాడి చేశారు. దీనిపై బాధితుడు ప్రభు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కంటి వైద్యశిబిరాల ఏర్పాటు అభినందనీయం

సోమల, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు అండగా కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయటం అభినందనీయమని టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు అన్నారు. సోమవారం కందూరులో మదనపల్లె రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 134 మందికి ఉచిత కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. 36 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మధుసూదన్ ఉచిత భోజనం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, రమణయ్య, విశ్వనాథం, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ హామీలను అమలు చేయాలి'

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కూటమి నాయకులు గిరిజనులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని గిరిజన సంఘం నాయకులు డిమాండ్‌చేశారు. దీనిపై సోమవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ రాముకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మునీంద్రనాయక్, నాగేనాయక్, మనోజ్‌కుమార్‌నాయక్, హీరానాయక్, దేశనాయక్, రాజునాయక్, నిర్మల్‌నాయక్, రవీంద్రనాయక్, చిన్నినాయక్, మురుగనాయక్, ఎరుకుల సంక్షేమసంఘనాయకుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పఠనంతో జ్ఞానోదయం

చౌడేపల్లె, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): భగవద్గీత పఠనంతో జ్ఞానోదయం పొందవచ్చునని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి సభ్యులు సుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం ఆయన సేవా సమితి సభ్యులతో కలసి మండలంలోని పెద్దయల్లకుంట్ల, శెట్టిపేట, తోటకురప్పల్లె, మేకలచిన్నేపల్లె, బీర్జేపల్లె, పందిళ్లపల్లె, ఆమినిగుంట, తెల్లనీళ్లపల్లె, చౌడేపల్లెలతో పాటు పలు గ్రామాల్లో పర్యటించి దసరా అంటే ఐదు కర్మేంద్రియాలను, ఐదు జ్ఞానేంద్రియాలను నశింప చేయునదని వివరించారు. అనంతరం భగవద్గీత విశిష్టతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు పద్మలత, లీలాకృష్ణ, కిరణ, ఈశ్వర్, నారాయణ, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిచ్చిన దుర్గాంబ



గిరింపేట దుర్గాంబ పూజల్లో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో దేవీ నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. గిరింపేటలోని దుర్గాంబ సోమవారం రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పాలక మండలి చైర్మన్ దిలీప్ రెడ్డి, ఈవో తిమ్మారెడ్డి, వరుణ్ కుమార్, కమిటీ సభ్యులు, భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తేనెబండలోని ముత్యాలమ్మను సరస్వతీదేవిగా, కట్టమంచి సాయిబాబా ఆలయంలో సరస్వతీదేవి అలంకారం చేశారు. ఇక పొన్నియమ్మ గుడివీధిలోని వీరాంజనేయస్వామి ఆలయంలో కృష్ణావతారం, కోదండరామస్వామి ఆలయంలో పరశురామ అవతారంలో స్వామివార్లను భక్తులు దర్శించుకున్నారు.


సాయిబాబా ఆలయంలో సరస్వతీదేవిగా అమ్మవారు


వీరాంజనేయస్వామి ఆలయంలో కృష్ణావతారం


కోదండరామాలయంలో పరశురామ అవతారం

గరుడ వాహనంపై నారాయణుడి విహారం



తిరుచ్చి వాహనంపై మోహినీ అవతారంలో ఊరేగుతున్న నారాయణస్వామి - గరుడవాహనంపై స్వామివారు

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వేపంజేరిలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి గరుడవాహనంపై నారాయణుడు విహరించారు. ఉదయం స్వామివారిని మోహినీ అవతారంలో అలంకరించి తిరుచ్చివాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేతుడైన నారాయణులకు కల్యాణోత్సవం పూజలు చేశారు. ఆలయట్రస్టీ, న్యాయవాది వాసు, అమృతవల్లి దంపతులు, మాజీ ఆలయట్రస్టీ సతీమణి సుమిత్రాశ్రీధర్, ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం: ఎమ్మెల్యే


టీడీపీ నాయకులతో కలిసి బాధితురాలికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పేదలకు వరమని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. సోమవారం లక్ష్మీనగర్ కాలనీలోని తన కార్యాలయంలో బాధితులకు సీఎంసహాయనిధినుంచి మంజూరైన రూ.31.07 లక్షల చెక్కులను అందజేశారు. వీరిలో చిత్తూరు అర్బన్ పరిధిలో 16మంది, చిత్తూరురూరల్‌లో ఆరుగురు, గుడిపాల మండలానికి చెందిన ఐదుగురు ఉన్నారు. మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, టీడీపీ నేతలు సుబ్రహ్మణ్యంనాయుడు, బాలాజి నాయుడు, మోహన్ రాజ్, జయచంద్ర నాయుడు, రఘు, ఈశ్వర్, నరేష్, ఉదయ్, పచ్చప్ప, గిరి, మధు పాల్గొన్నారు.

జీఎస్టీ వివరాలు ప్రదర్శించాలి: కమిషనర్


నగరిలో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నగరి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తగ్గిన జీఎస్టీ రేట్లు చూపేలా వివరాలను తమ దుకాణాల వద్ద వ్యాపారవేత్తలు ప్రదర్శించాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి ఆదేశించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో జీఎస్టీ 2.0పై డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ పూర్ణం ఆధ్వర్యంలో వ్యాపారవేత్తలు, కాంట్రాక్టర్లు, మున్సిపల్, మెప్మా సిబ్బందితో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి ఓంశక్తి గుడి వరకు ర్యాలీ నిర్వహించారు. ఓంశక్తి ఆలయం వద్ద మానవహారం నిర్వహించారు. పూర్ణం మాట్లాడుతూ.. జీఎస్టీపై ఎటువంటి సందేహాలున్నా 1100, 1195 టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేయొచ్చన్నారు.

వరసిద్ధుడి సేవలో గల్లా జయదేవ్


గల్లా జయదేవ్‌కు వరసిద్ధుడి జ్ఞాపికను అందిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పారిశ్రామికవేత్త గల్లాజయదేవ్, పల్నాడు జిల్లా పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సోమవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. వేర్వేరుగా వచ్చిన వీరిని ఎమ్మెల్యే మురళీమోహన్ ఆహ్వానించి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ చైర్మన్ మణినాయుడు, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు, నాయకులు మధుసూదనరావు, నరసింహులునాయుడు, ఆలయ మాజీచైర్మన్ జగన్నాథరెడ్డి, ఏడీ బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.


కాణిపాకం: కాత్యాయనీదేవి అలంకరణలో మరగదాంబిక


నింద్ర: సరస్వతీదేవిగా మహాలక్ష్మి అమ్మవారు


పాలసముద్రం: లలితాదేవిగా చెవిటి గంగమ్మ



శ్రీరంగరాజపురం: సరస్వతీదేవిగా గంగమ్మ, లలితా త్రిపుర సుందరీ దేవిగా శ్రీమూర్తి అమ్మ


బంగారుపాళ్యం: దుర్గాదేవిగా ముత్యాలమ్మ

కాత్యాయనీదేవిగా మరగదాంబిక

పలు రూపాల్లో కొలువుదీరిన అమ్మవార్లు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి):దసరా వేడుకల్లో భాగంగా.. కాణిపాకంలోని మరగదాంబిక అమ్మవారు కాత్యాయనిదేవి అలంకారంలోభక్తులను కరుణించారు. సాయంత్రం భక్తుల ఆధ్వర్యంలో కుంకుమార్చన నిర్వహింపజేశారు. రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని కాణిపాకం పుర వీధుల్లో ఊరేగించారు. ఏఈవో రవీంద్రబాబు, ప్రధాన అర్చకుడు సోమశేఖర్‌గురుకుల్, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, చిట్టిబాబు పాల్గొన్నారు.

నింద్ర:మండలం కూనమరాజుపాళెంలోని మహాలక్ష్మీ అమ్మవారు.. సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పాలసముద్రం: మండలంలోని బలిజకండ్రిగలోని చెవిటిగంగమ్మ.. లలితాదేవి అలంకారంలో భక్తులకు దర్శమిచ్చారు. ఉభయదారులుగా ఎం.వాసునాయుడు కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

శ్రీరంగరాజపురం: ఆరిమాకులపల్లెలోనిగంగమ్మ.. సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. ఉభయదారులుగా నారాయణమ్మ, నరసింహారెడ్డి కుమారులు వ్యవహరించారు. వేణుగోపాలపురంలోని శ్రీమూర్తి అమ్మను లలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. ఉభయదారులుగా తాటిమాకులపల్లె గ్రామం గెట్టాం వంశస్తులు గొల్లఇండ్లు వ్యవహరించారు.

బంగారుపాళ్యం: గ్రామదేవత ముత్యాలమ్మ.. దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. ఉభయదారులుగా బంగారుపాళ్యం సర్పంచు ఉమాదేవి, ఎంబీ కృష్ణమూర్తి, రాంబాబు నాయుడు, హేమలత, గుణవతి, శేఖర్, భవిత, భార్గవి, పావని, చిరంజీవి, సాయి భువన్, నాగరత్నమ్మ, ప్రసన్న వ్యవహరించారు.

వెదురుకుప్పం: మండలం డీఆర్ఎన్‌కండ్రిగలో కొండమల్లీశ్వరస్వామి ఆలయ సముదాయంలోని రాజరాజేశ్వరీ దేవి.. సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. కార్వేటినగరంమండలం దేరాకండ్రిగలోని నైనేరమ్మ కూడా సరస్వతీదేవిగా భక్తులను కటాక్షించారు.

గంగాధరనెల్లూరు: గ్రామంలోని అల్లియెల్లమ్మ.. సరసతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులుగా సర్వేరెడ్డిపల్లెకు చెందిన మునిరెడ్డి వ్యవహరించగా, ఆలయం వద్ద దిగువూరుకు చెందిన అనిల్‌రెడ్డి కుటుంబీకులు అన్నదానం చేశారు.

నగరి: పట్టణంలోని దేశమ్మ.. మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. కరకంటేశ్వర ఆలయంలో కామాక్షి అమ్మవారు సరస్వతీదేవిగా, బుగ్గ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలోని అన్నపూర్ణాదేవి.. మహాగౌరిగా భక్తులను అనుగ్రహించారు.

విజయపురం: మిట్టూరులోని కనకదుర్గమ్మ.. సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. భక్తులకు ఉభయదారులు అన్నదానం చేశారు.



వెదురుకుప్పం: డీఆర్ఎన్‌కండ్రిగలో సరస్వతీదేవిగా రాజరాజేశ్వరిదేవి, దేరాకండ్రిగలో సరస్వతీదేవిగా నైనేరమ్మ


గంగాధరనెల్లూరు: సరస్వతీదేవిగా అల్లియెల్లమ్మ



నగరి: మహిషాసుర మర్దినిగా దేశమ్మ, సరస్వతీదేవిగా కామాక్షి అమ్మవారు


విజయపురం: సరస్వతీదేవిగా కనకదుర్గమ్మ

కూటమి ప్రభుత్వం మహిళా పక్షపాతి: ఎమ్మెల్యే

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మహిళా పక్షపాతి అని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. సోమవారం కొంగారెడ్డిపల్లె కూరగాయల మార్కెట్ వద్ద చిత్తూరు నగరపాలక సంస్థ, ఐవోసీఎల్ రిటైల్ అవుట్‌లెట్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐవోసీఎల్ అవుట్‌లెట్‌తో నగరపాలకసంస్థకు ఆదాయం వస్తుందన్నారు. జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రతి మధ్య తరగతి కుటుంబానికి ఆర్థికలాభం చేకూరుతుందని చెప్పారు. చిత్తూరుకు త్వరలో యూనివర్సిటీ ప్రకటన వస్తుందన్నారు. అసెంబ్లీలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారన్నారు. మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్ మాట్లాడుతూ.. ఐవోసీఎల్ పెట్రోల్ బంకు వల్ల నగరపాలకసంస్థకు ఆదాయంతోపాటు నాణ్యమైన పెట్రోల్, డీజిల్ ప్రజలకు అందే అవకాశం ఉందన్నారు. చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్ కుమార్‌రెడ్డి, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అంతకుముందు జీఎస్టీ కరపత్రాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

ప్రతి కార్యకర్తా సైనికుడిలా పనిచేయాలి: టీడీపీ

గుడిపాల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి కార్యకర్తా సైనికుడిలా పనిచేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, చిత్తూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీటర్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో వారు ప్రసంగించారు. కార్యకర్తలకు ఎలాంటి సమస్యలున్నా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. టీడీపీ ప్రధాన కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యయాదవ్, మాజీ జడ్పీటీసీలు బాలాజీనాయుడు,సుమతి మురళినాయుడు, సింగిల్‌విండో అధ్యక్షుడు ప్రతాప్ నాయుడు, మాజీ ఎంపీపీ నాగరాజయాదవ్, నాయకులు చల్లా, గుర్రప్పనాయుడు, ఉదయ, శరత్, శిల్ప, జయచంద్ర, బాబురెడ్డి, దొరబాబు,కిట్టు, బాబు, మహదేవ, బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

మనిషి తత్వాన్ని బోధించిన 'సినారె'


సన్మానం అందుకున్న రచయితలు

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు జాతికి మనిషి తత్వాన్ని బోధించిన మహాకవిగా 'సినారె' అని భారతీయ తెలుగు రచయితల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు సి.నారాయణ స్వామి, ఎం.వి.కేశవరెడ్డి స్మారక ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.వి.శ్రీధర్ రెడ్డి అన్నారు. సోమవారం కొంగారెడ్డిపల్లెలోని బ్రెయిన్ బాక్స్ అకాడమీలో ప్రముఖ సాహితీవేత్త మల్లిపూడి దేవేంద్రరావు నేతృత్వంలో 'సినారె సాహితీ వైభవం' పేరిట గీతాలాపన, కవితార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సినారె 90 వరకు గ్రంథాలు, సినీ సాహితీ ప్రస్థానంలో 3,500కిపైగా గీతాలు రాశారన్నారు. అనంతరం 30 మంది రచయితలకు 'సినారె' పురస్కారాలను ప్రదానం చేశారు. రచయితలు నందిపాటి చక్రపాణి, కొఠారి వెంకటరత్నం, శాంతకుమారి, వి.రఘుపతి, ఆర్ఎస్ రాజన్, ఎం.శ్రీరాజు, సోము, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఉద్దుల పంపిణీ

విజయపురం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతులకు సబ్సిడీపై అందిస్తున్న ఉద్దులను విజయపురం రైతు సేవా కేంద్రంలో సోమవారం ఎంపీపీ బాలాజి పంపిణీచేశారు. ప్రతి రైతుకు సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కోసలనగరంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేటినుంచి వేణుగోపాలుడి ఆలయ కుంభాభిషేకం



నింద్ర, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కచ్చరవేడులో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ మహా కుంభాభిషేక వేడుకలు మంగళవారం నుంచి గురువారం వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

యాదమరి పీఏసీఎస్‌లో విరివిగా రుణాలు: చైర్‌పర్సన్


సమావేశంలో ప్రసంగిస్తున్న చిత్రా నాయుడు

యాదమరి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): యాదమరి సహకార సంఘం పరిధిలోని రైతులకు విరివిగా రుణాలు మంజూరు చేస్తామని చైర్‌పర్సన్ వి.చిత్రా నాయుడు తెలిపారు. సోమవారం జరిగిన మహాజన సభలో అధ్యక్షత వహించిన ఆమె మాట్లాడుతూ.. సంఘం ప్రగతి సాధిస్తేనే తిరిగి రైతులకు మరింత ఎక్కువగా సేవ చేయగలుగుతుందని స్పష్టం చేశారు. కొత్తగా మంజూరైన రుణాలకు సంబంధించిన చెక్కులను రైతులకు అందజేశారు. బ్యాంకు సూపర్‌వైజర్ టి.ధనంజయరెడ్డి, పాలకవర్గ సభ్యులు మహబూబ్ బాషా, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు హరిప్రసాద్ నాయుడు, జ్యోతి మోహన్, సీఈవో గుణశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

దారి సమస్య పరిష్కారానికి చర్యలు

పెనుమూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శాతంబాకం గ్రామం రామాపురం దళితవాడలోని డీకేటీ భూమికి దారిలేదని సురేష్ సోమవారం కలెక్టరేట్‌లో అర్జీ అందజేయగా అధికారులు విచారణ జరిపారు. తహసీల్దార్ శ్రావణ్ కుమార్, ఎస్ఐ వెంకటనరసింహతోపాటు రెవెన్యూ, పోలీసులు కలిసి భూములను పరిశీలించి, బండిదారులను మ్యాప్ ప్రకారం గుర్తించారు. ఆ దారుల్లోని మామిడి చెట్లు, పైపులు తొలగించడానికి మూడ్రోజుల గడువిచ్చారు. అయితే ఈ దారుల్లో సాగుచేసిన నాగేశ్వరరావు కుటుంబీకులు పెట్రోల్ క్యాన్, బాటిల్‌తో బెదిరింపులకు పాల్పడటంతో వారిని ముందస్తుగా బైండోవర్ చేశారు.

'ఏఐ'పై అవగాహన పెంచుకోవాలి

నగరి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)పై విద్యార్థులకు అవగాహన పెంచుకోవాలని నగరి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ సూచించారు. కళాశాలలో ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్ ముగింపు సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఇంగ్లీష్ విభాగం అధ్యాపకులు రేవతి, పంకజలను ప్రశంసించారు. జేకేసీ మెంటార్ లాల్ బాషా, అధ్యాపకులు పాల్గొన్నారు.

యూరియా, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

యాదమరి మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్


యూరియా కొరతపై సమావేశంలో ఏవోను ప్రశ్నిస్తున్న సభ్యులు

యాదమరి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఉదయం యాదమరి మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ సురేష్ బాబు అధ్యక్షతన ఈ సమావేశాన్ని ఎంపీడీవో వీరేంద్ర నిర్వహించారు. సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు. యూరియా, విద్యుత్‌తోపాటు పలు సమస్యలను సభ్యులు ప్రస్తావించి, పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తెల్లరాళ్లపల్లె, బుడితిరెడ్డిపల్లె, కాశిరాల సర్పంచ్‌లు భజలింగం, వాసుదేవరెడ్డి, రాధా మాట్లాడుతూ.. యూరియా సరిపోక రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆరోపించారు. తాగునీటి, వ్యవసాయ, విద్యుత్ పనులు పూర్తిచేయడంలోనూ అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. తహసీల్దార్ పార్థసారథి, ఎంపీడీవో మాట్లాడుతూ యూరియా వినియోగంపై సాయంత్రంలోపు వివరాలు అందజేయాలని ఏవోను ఆదేశించారు. మొత్తానికి అధికారులు కేవలం కాగితాల్లో రాసిన అంశాలను చదివి, దాదాపు గంటన్నరలో సమావేశాన్ని ముగించేశారు. సింగిల్ విండో చైర్‌పర్సన్ చిత్రా నాయుడు, వైస్ ఎంపీపీలు రవీంద్ర బాబు, హరినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఎస్టీలంతా చదువుకోవాలి

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్టీ కుటుంబాల్లోని పిల్లలంతా చదువుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. తూగుండ్రం పంచాయతీ దాసరపల్లె ఎస్టీకాలనీలో సర్పంచ్ శ్రీబాబు అధ్యక్షతన పౌరహక్కుల దినోత్సవాన్ని అధికారులు, నేతల సమక్షంలో నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో లోకేష్, పెనుమూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ నియాజ్‌అలీ, పార్లమెంట్ టీఎన్‌టీయుసీ అధికార ప్రతినిధి జీవరత్నం, తూగుండ్రం ఎంపీటీసీ వాణిశ్రీ కేశవులు, టీడీపీ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం


సుధాకరరెడ్డిని సన్మానిస్తున్న జగదీష్‌నాయుడు తదితరులు

వెదురుకుప్పం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, పచ్చికాపల్లం పీహెచ్‌సీ ఉద్యోగులు సంయుక్తంగా సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ కృష్ణచైతన్య, బీజేపీ నేతలు తాతిరెడ్డి సుధాకరరెడ్డి, జగదీష్ నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'పీజీఆర్ఎస్'కు ఆరు అర్జీలు

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి):నగరపాలక కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యయల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరు అర్జీలు వచ్చాయని కమిషనర్ నరసింహ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వోలోకేష్, ఏసీపీ నాగేంద్ర, ఎంఈ వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

చూడి ఆవుల సంరక్షణలో జాగ్రత్తలు పాటించాలి

వెదురుకుప్పం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): చూడి ఆవులు, లేగ దూడల సంరక్షణలో జాగ్రత్తలు పాటించాలని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులుసూచించారు. సోమవారం కార్వేటినగరం మండలం అన్నూరులో పాడి రైతులతో నిర్వహించిన సమావేశంలో పలు సూచనలిచ్చారు. శాస్త్రవేత్త అనూష పాల్గొన్నారు.

పంచాయతీల ఆదాయ వనరులపై అవగాహన

వెదురుకుప్పం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల ఆదాయ వనరులపై అవగాహన పెంపొందించుకోవాలని కార్వేటినగరం ఎంపీడీవో చంద్రమౌళి సూచించారు. సోమవారం తనకార్యాలయంలో సర్పంచ్‌లు, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఈఅంశంపై సమావేశం నిర్వహించారు.

నేడు పనిచేయనున్న విద్యుత్ బిల్లు చెల్లింపు కౌంటర్లు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సౌకర్యం కోసం మంగళవారం సెలవైనప్పటికీ చిత్తూరు ఆపరేషన్ డివిజన్ పరిధిలోని అన్ని విద్యుత్ బిల్లుల చెల్లింపు కౌంటర్లు యథావిధిగా పనిచేయనున్నాయి. ఈ మేరకు ఈఈ మునిచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు.